నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | డిసెంబర్ 15, 2023 | www.navatelangana.com

అభివృద్ధి పనులు పరిశీలన



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలను ఎంపిడివో నరేష్ గురువారం పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మండలంలోని పెద్ద ప్రభుత్వ ఎంపియూపీఎస్‌లోని హెచ్‌ఎం సంగ్రాతో కలిసి వంటగది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచికరంగా వండాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహకులకు సూచించారు. పెద్దఎడ్గి జీపీలో నర్సరీని పరిశీలించి జూన్ హరితహారం కోసం మొక్కల పెంపకం చేపట్టాలని ఎఫ్ఏ సుభాష్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎంపిడివో వెంట ఎంపివో యాదగిరి, ఎఫ్ఏలు, పెద్దగుల్ల పాఠశాల హెచ్‌ఎం సంగ్రాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో శ్రీ సాయివిజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ వంశీకృష్ణ 10 తరగతి విద్యార్థిని సన్మానించారు. ఈ నెల 12వ తేదీన అండర్ 17వ విభాగంలో కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కబడ్డీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులొస్తాయా..? రావా?




అయోమయంలో సర్పంచ్‌లు.. పూర్తికానున్న పదవీకాలం

గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్. ఆ సర్పంచ్‌లకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాశే మిగిల్చిందని చెప్పాలి. తెలంగాణ ఏర్పడ్డాక రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సర్పంచ్‌లను ఆదేశించింది. దీంతో ఆ గ్రామ సర్పంచ్‌లే అన్నీ తానై పనులు చేయించారు. తీరా చివరకు వారు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించలేదు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎలాగైనా తమ బిల్లులు వస్తాయనుకున్న సర్పంచ్‌లకు నిరాశే మిగిలింది. ఇదిలా ఉండగా.. వారి పదవీ కాలం 2024 జనవరి 31తో ముగియనుండగా.. కొత్త ప్రభుత్వమైనా గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన నిధులను మంజూరు చేస్తుందా? లేదా? అనే ఆందోళనలో సర్పంచ్‌లు ఉన్నారు.

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజవర్గంలో 250 గ్రామాలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలలో పలు అభివృద్ధి పనులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు చేపట్టారు. కొందరు సర్పంచ్‌లు కాంట్రాక్ట్ పనులను సొంతంగా చేపట్టారు. 2022 నుంచి 2023 వరకు చేసిన పనులకు నిధులు రాలేవని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. గతంలో అయితే ఆయా గ్రామాల సర్పంచ్‌లు మహిళ సంఘాల భవనాలు, ఎస్టీ కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ ప్రహరీ, పంచాయతీ ప్రహరీ, డ్రయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. కేసీఆర్ ప్రభుత్వమే మళ్ళీ అధికారంలోకి వస్తుందని ధీమాలో ఉన్న సర్పంచ్‌లు అభివృద్ధి పనులు సైతం అదేవిధంగా చకచకా కొనసాగించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు కావటంతో అభివృద్ధి పనుల నిధులు ఎట్లా తెచ్చుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొందని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

ఒక్కో సర్పంచ్‌కు రూ.5 నుంచి 40 లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. చిన్న తండా పంచాయతీల నుంచి మేజర్ పంచాయతీలకు గానూ రూ.5లక్షల నుంచి 40 లక్షల వరకు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు రావలసి ఉందని సర్పంచ్‌లు చెబుతున్నారు.



చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో పూర్తికాని ఎస్సీ కమ్యూనిటీ హాల్

ముగియనున్న పదవీ కాలం..

సర్పంచ్‌ల పదవీ కాలం జనవరి 31తో ముగియనుంది. దీంతో గ్రామంలో చేసిన చిన్నచితక పనుల నిధులు ఎలా వస్తాయోనని ఆలోచనలో సర్పంచ్‌లు దిగులుగా ఉన్నట్టు తెలుస్తుంది. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందా? లేదా? అనే ప్రశ్న సర్పంచ్‌ల్లో నెలకొంది.

ఆగిన పనులు కొనసాగేనా..?

ప్రస్తుతం గ్రామాలలో నిలిచిన కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అదనపు పనుల ఆగిపోయాయి. ఈ పనులకు సంబంధించిన బిల్లులు కొత్త సర్పంచ్‌లకు వస్తాయా?, లేదా పాత సర్పంచ్‌లకు వరించేనా అనేలా ప్రస్తుత సర్పంచ్‌లకు తలనొప్పిగా మారింది. గతంలో చేపట్టిన పనులకు అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సర్పంచ్‌లు పనుల కోసం చేసిన అప్పులు తీర్చడానికి ఎకరం పొలం, బంగారం అమ్ముకునే పరిస్థితి నెలకొందని సర్పంచ్‌లు వాపోతున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడిన చిరుతపులి

అయ్యో చిరుతా..!

- రోడ్డు ప్రమాదంలో మృత్యువాత
- గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఘటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చిరుత పులి మృత్యువాతపడింది. ఈ ఘటన సదాశివనగర్ మండలంలోని దగ్గి అటవీ ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతున్న ఏడాది వయస్సు గల ఆడ చిరుత పులిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. స్థానికులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి వైపు నుంచి నిజామాబాద్ వైపు వచ్చే రహదారి నుంచి దాటుతుండగా చిరుతపులిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై మృత్యువాతపడింది. సమాచారం అందుకున్న కామారెడ్డి రేంజ్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చిరుతను పరిశీలించారు. అనంతరం చిరుతపులిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కాగా శుక్రవారం డాక్టర్లతో శవ పంచనామా నిర్వహించి, దాని అవయవాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించనున్నారు. అనంతరం డిఎఫ్ఓ, ఎఫ్‌డిఓల ఆధ్వర్యంలో చిరుత మృతదేహానికి దహన సంస్కరాలను చేపట్టనున్నారు. ఇందల్వాయి వద్ద ఉన్న టోల్‌ప్లాజాలో సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేపడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

పొద్దు తిరుగుడు, శనగ పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని రైతులు శనగ, పొద్దు తిరుగుడు పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జుక్కల్ మండల వ్యవసాయాధికారి నవీన్ కూమార్ అన్నారు. గురువారం మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో రైతులతో కలిసి శనగ, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. పొద్దు తిరుగుడు పంటలో లద్దెపురుగు అధికంగా ఉన్నట్టు గమనించామని తెలిపారు. దీని నివారణకు విషపు ఎరను ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. విషపు ఎరను ఎలా తయారు చేసుకోవాలో రైతులకు వివరించారు. పొద్దు తిరుగుడు విత్తనం కొనే ముందు జాగ్రత్తగా నాణ్యమైన విత్తనాలను కొనాలని, శనగ పంటలపైన పురుగుల బెడద ఉధృతి గమనిస్తే వ్యవసాయ కార్యాలయంలో అధికారులకు కలిసి వారి సూచనల మేరకు రసాయన ఎరువులు మోతాదులో వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రోగ్రేసివ్ రైతులు, ఏవో, ఏఈవో తదితరులు పాల్గొన్నారు.

పోచారం మాటలు హస్యాస్పదం : కాంగ్రెస్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ ఇప్పటి వరకు రైతులకు అందలేదని అన్నారు. ఆ విషయం పక్కనబెట్టి కొత్త ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు. రాష్ట్రం అప్పుల కుప్పలుగా మార్చి నేడు అధికారంలోకి రాగానే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం మానుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తుందని సీనియర్ నాయకులు గంగాధర్ దేశాయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మనోహర్, మాజీ జెడ్పీటీసి శివరాజ్ దేశాయ్, డాక్టర్ వెనిగళ్ళ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు, లారీ ఢీ.. పోలీసులపై దౌర్జన్యం

నవతెలంగాణ-భిక్కనూర్

కారు, లారీ ఢీకొనగా.. ఘటన పరిశీలించేందుకు వెళ్లిన పోలీసులపై వ్యక్తులు దౌర్జన్యం చేశారు. ఈ ఘటన మండలంలోని 44వ జాతీయ రహదారిపై స్థానిక టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టోల్‌ప్లాజా వద్ద కారు, లారీ ఢీకొనగా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. అప్పటికే ఢీ కొన్న కారులోని ముగ్గురు వ్యక్తులు తాగిన మైకంలో లారీ డ్రైవర్‌పై గొడవ పడుతూ దాడి చేస్తున్నారు. డ్రైవర్‌ను కొట్టవద్దని, గొడవ ఆపాలని ఏఎస్ఐ జగదీష్ చెప్పినా.. కారుకు సంబంధించిన ముగ్గురు వ్యక్తులు ఏఎస్ఐని బూతులు తిడుతూ దౌర్జన్యం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేసే క్రమంలో ఆ మిషన్‌ను సైతం పగులగొట్టారు. పోలీసులపై దాడికి దిగారు. ఏఎస్ఐ జగదీష్ ఫిర్యాదు మేరకు పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

దొరల పాలన పోయింది ప్రజా పాలన వచ్చింది

- మాజీమంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

దొరల పాలన పోయి తెలంగాణలో ప్రజా పాలన వచ్చిందని మాజీమంత్రి షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్‌లో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాజీమంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని రేవంత్‌రెడ్డి తెలిపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోలో ఆరు పథకాలను అమలు చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలో నుంచి మొదటగా మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేశామన్నారు. ఆరోగ్యశ్రీ 10 లక్షల వర్తింపు అమలు చేశాం, మిగతా గ్యారంటీ పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రతిపక్షాలు విమర్శలను తిప్పి కొట్టాలన్నారు. తెలంగాణ ప్రజల త్యాగాల వల్ల ఏర్పాటైందని, కెసిఆర్ కుటుంబం వల్ల తెలంగాణ రాలేదని తెలంగాణ ప్రజలు గ్రహించాలన్నారు. కార్యకర్తలు ఈ శాసనసభ ఎన్నికల్లో ఎంతో కృషి చేశారని, ఎంతో కష్టపడ్డారని వారికి కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ కోసం పనిచేసిన, నాయకులను, కార్యకర్తలను గుర్తించి తగిన పదవులను అందిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తెలంగాణ ప్రజలకు మంచి రోజులు వచ్చాయన్నారు. అధిష్టానం రేవంత్‌రెడ్డిని కామారెడ్డిలో పోటీ చేయాలని పేర్కొనడం వల్ల, తాను నిజామాబాద్ అర్బన్‌లో పోటీ చేయాల్సి వచ్చిందని, రాబోయే 15 రోజుల్లో కామారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశం హైదరాబాద్‌లో నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయంలో కామారెడ్డిలో అభివృద్ధి శూన్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు, కామారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేశారన్నారు. షబ్బీర్ అలీ కార్యకర్తలను అధికారంలో ఉన్న, లేకున్నా ఆదుకుంటూ వచ్చారన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారని, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, ఇందిరానగర్, టీచర్స్ కాలనీ, బతుకమ్మ కుంట, గోసంగి కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, ఆర్.బి.నగర్, వంటి కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి పార్టీ కార్యకర్తకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏ సమస్య వచ్చినా షబ్బీర్‌అలీ దృష్టికి తీసుకురావాలని కొండల్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, నిజామాబాద్ కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, రామారెడ్డి మండల జడ్పిటిసి సభ్యుడు నారెడ్డి మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, పండ్ల రాజు, మాజీ సీడీసీ చైర్మన్ కారంగుల అశోక్‌రెడ్డి, గోనె శ్రీనివాస్, న్యాయవాది దేవరాజ్‌గౌడ్, పంపరి లక్ష్మణ్, భిక్కనూర్ కాంగ్రెస్ నాయకులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్, బిబిపేట, రాజంపేట, రామారెడ్డి మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి

ప్రాణం కాపాడేందుకు కదిలి..

- 149 యూనిట్ల రక్త సేకరణ

నవతెలంగాణ-కామారెడ్డి

రక్తం కావాలని కోరిన వెంటనే స్పందించి రక్తదానం చేసిన చేసిన రక్తదాతలందరికీ ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైందని జిల్లా వ్యాప్తంగా ఉన్న రక్తదాతలు మానవతా దృక్పథంతో స్పందించి ముందుకు వచ్చి రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, 290 సార్లు రక్తదానం చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పిన సంపత్ కుమార్‌లు మాట్లాడుతూ.. మెగా రక్తదాన శిబిరం ద్వారా 148 యూనిట్ల రక్తాన్ని సేకరించడం అంటే సాధారణ విషయం కాదని, కామారెడ్డి జిల్లా రక్తదాతలు అంటే తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని, వందలాదిగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందిస్తూ, వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్న ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలును, వారి బృందాన్ని అభినందిస్తున్నామన్నారు. సంవత్సరం కాలంలోనే 1900 యూనిట్ల రక్తాన్ని తలసేమియా చిన్నారులకు అందించి సామాజిక సేవలో రికార్డును నెలకొల్పారని అన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రషీద్, ఉపాధ్యక్షులు జమీల్ హైమద్, డాక్టర్ పుట్ల అనిల్, కిరణ్, సలహాదారులు వెంకటరమణ, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రెడ్‌డ్రాప్ నిర్వాహకులు రెహమాన్, ఆర్కే విద్యాసంస్థల సీఈవో జైపాల్‌రెడ్డి, నవీన్, సందీపనీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు నవీన్, మురళి, దేవయ్య అంజల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

బల్బు వెలగాల్సిందే.. ఫ్యాన్ తిరగాల్సిందే..

- అధికారులు ఉన్నా.. లేకున్నా అంతే
- కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల తీరు

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా.. దానిని ప్రభుత్వ అధికారులే పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఉన్నా లేకున్నా లైట్లు వెలగాల్సిందే.. ఫ్యాన్ తిరగాల్సిందే అన్నట్టుగా కామారెడ్డి జిల్లాలో కొనసాగుతుంది.

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ జిల్లా కార్యాలయంలో గురువారం లైట్లు వేసి ఉంచి, ఫ్యాన్ తిరుగుతూనే ఉంది. సిబ్బంది చూసినా వాటిని మాత్రం నిలుపుదల చేయలేదు. పంచాయతీరాజ్ జిల్లా కార్యాలయానికి వచ్చిన కొందరు అధికారి ఆదేశాల మేరకే లైట్లు వెలుగుతూ, ఫ్యాన్ తిరుగుతుందని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారి వివిధ శాఖలపై దృష్టి పెట్టవలసిన అవసరం ఉందని, విద్యుత్ ఆదాచేసేలా సిబ్బంది, అధికారులు కార్యాలయంలో లేని సమయంలో బల్బులు, ఫ్యాన్లు బంద్ చేయాలని పలువురు కోరుతున్నారు.


వెలుగుతున్న బల్బ్, తిరుగుతున్న ఫ్యాన్



యువతి దారుణ హత్య

- నిప్పుపెట్టి కాల్చిచంపిన దుండగులు

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-సదాశివనగర్

యువతి దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లి శివారులోని కాళేశ్వరం కాలువ పక్కన చోటుచేసుకుంది.



భారీ అగ్నిప్రమాదం

- కామారెడ్డిలోని అయ్యప్ప షాపింగ్ మాల్‌లో ఘటన
- కంచి, బనారస్ తదితర పట్టుచీరలు అగ్నికి ఆహుతి
- రూ.10 కోట్లకు పైగానే ఆస్తి నష్టం

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్‌లో గల అయ్యప్ప షాపింగ్ మాల్‌లో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది.



మోడల్ కళాశాల విద్యార్థికి బంగారు పతకం


బంగారు పథకం సాధించిన అనుదీప్

నవతెలంగాణ-సిరికొండ

ఈనెల 13న ఢిల్లీలో జరిగిన అండర్-19 జాతీయ స్థాయి ఇండియన్ నేషనల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగుపందెంలో సిరికొండ మోడల్ కళాశాల విద్యార్థి అనుదీప్ ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో జాతీయ స్థాయిలోనే ప్రథమ స్థానంలో గెలుపొంది బంగారు పతకాన్ని సాధించినట్లు పీడీ కిషన్ తెలిపారు. మూడు కిలోమీటర్ల పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఐదు కిలోమీటర్ల మారథాన్ రేస్‌లో ప్రథమ స్థానం సంపాదించి జాతీయ స్థాయిలో సిరికొండ మోడల్ కళాశాలకు పేరు తీసుకురావడంతో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గంగా ప్రసాద్, పీడీ కిషన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

19న పెన్షనర్స్ డే


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షన్ అనేది ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రోజును దేశవ్యాప్తంగా పెన్షనర్స్ డే నిర్వహించుకుంటున్నారు. దానిలో భాగంగానే నిజామాబాదులో ఈ నెల 19న న్యూ అంబేద్కర్ భవన్‌లో పెన్షనర్స్ డే ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు ప్రధాన కార్యదర్శి మధుసూదన్ కోశాధికారి ఈవిల్ నారాయణ గురువారం తెలిపారు.

ఈ సభకు తెలంగాణ రాష్ట్ర సాధన రథసారథ ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు రాష్ట్ర నాయకులు, జిల్లా అధికారులు అతిధులుగా హాజరవుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలి


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘం ద్వారా రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఏఓ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం రైతులు యాసంగి పంటలైన మొక్కజొన్న, జొన్న పంటలకు యూరియా, వరి దుక్కిలో అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను సొసైటీలో సిద్ధంగా ఉంచాలని సొసైటీ సెక్రెటరీ, సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం బాల్కొండ పరిధిలో సొసైటీ ద్వారా 48 టన్నులు, ప్రైవేటు ద్వారా 30 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రంలో అవసరమైనంత యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మొహీద్ పాషా, సిబ్బంది ఉన్నారు.

ప్రజాఉద్యమాలు అణచివేయుటంతోనే నిరసనలు : సీపీఐ



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రజా ఉద్యమాలు అణచివేయుట మూలంగానే పార్లమెంట్లో ఇలాంటి నిరసనలు వ్యక్తమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త పార్లమెంట్ భవనం భద్రతను ప్రశ్నించే విధంగా నిరసనకారులు సంచలన ఘటన సృష్టించారని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతాంగ, కార్మిక, యువత, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ఉద్యమాలను అణిచివేయుట మూలంగానే ఢిల్లీ పార్లమెంటు భవన్‌లో భగత్ సింగ్ ఫ్యాన్ క్లబ్ సభ్యులు పార్లమెంట్లోకి వెళ్లి స్మోక్ క్యాన్లను తెరిచి నిరసన తెలియజేశారని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉందని, కావున ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేయాల్సిన అవసరం ఉన్నదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్లమెంట్ భవనంలో వెలుపల ఉన్న పార్లమెంటు సభ్యుల ఆరోగ్యాలు, ప్రాణాలు దృష్టిలో పెట్టుకొని నిరసన కార్యక్రమం చేస్తే బాగుండేదని అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న బిజెపి రైతాంగ, కార్మిక, నిరుద్యోగ సమస్యల పరిష్కానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు వై.ఓమయ్య, బి.రఘురాం మరియు వెంకటేశం గుప్తా పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలు, పోషకాహారం, లైంగిక వేధింపులు, పరిసరాల పరిశుభ్రత గురించి అవగహన కల్పించినట్టు ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి అన్నారు. బాల్య వివాహాలు, నిరోధక చట్టంపై పూర్తి అవగాహన కల్పించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం ఏఎస్సై గంగారాం మాట్లాడుతూ.. మహిళా షీటీం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్, ఐసీపీస్ సిబ్బంది సాయిలు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉద్ధవ్, రమాదేవి, ఉపాధ్యాయ బృందం, అంగం వాడి టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ బిల్లు ఆమోదంపై హర్షం


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌లాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణా రాష్ట్రంలో సమ్మక్క- సారక్క గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లు పార్లమెంటులో ఆమోదం తెలపటం పట్ల తెలంగాణ రచయితలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం నగరంలోని తెలంగాణ రచయితల వేదిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధక్షులు ప్రేమ్ లాల్ మాట్లాడుతూ తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు తప్పనిసరి అయినప్పటికీ గతంలో తెలంగాణ ప్రభుత్వం సరైన సమయలో సహకరించని కారణంగా వర్సిటి ఏర్పాటు ఆలస్యమైందని అన్నారు. ఇప్పటికైనా తాము కోరుకున్న విధంగా వర్శిటి ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అని అన్నారు. యునివర్సిటీకి అవసరమైన నిధులు వెచ్చించాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు లక్ష్మణ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మిర్దాపల్లి విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మండలంలోని మిర్దాపల్లి జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్ గురువారం తెలిపారు. ఈనెల 8న శుక్రవారం కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లాల బాల బాలికల సబ్ జూనియర్ హాకీ సెలక్షన్‌లో రిశ్వంత్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయికి సెలెక్ అయ్యారు. విద్యార్థి ఈనెల డిసెంబర్ 16 నుండి కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్నట్టు తెలిపారు. 13న ఆర్మూర్ మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల అండర్-17 జూనియర్ బాల బాలికల విభాగంలో జరిగిన హాకీ సెలక్షన్స్ లో ప్రవీణ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ విద్యార్థి ఈనెల 17 నుండి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయిన విద్యార్థులకు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్ రెడ్డి అభినందనలు తెలుపుతూ రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు.


బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారని బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి బి శ్యామ్ గురువారం తెలిపారు. ఈ ఎంపికలకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుండి పురుషులు 30, మహిళలు 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో నుండి ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 18 నుండి 21వరకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తారని చెప్పారు. శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను డిసెంబర్ 22 నుండి 24 వరకు సికింద్రాబాద్‌లోని హెచ్ఏఎల్ గ్రౌండ్స్ బాల్‌నగర్‌లో జరిగే 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, పాఠశాల కరస్పాండెంట్ పద్మ సంఘం ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్ సంఘ సభ్యులు స్వప్న గీత, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆర్‌కె కళాశాలను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం బోధన్ పట్టణంలోని ఆర్.కె ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలించారు. సమీప భవిష్యత్తులో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల సంఘం మార్గనిర్దేశం మేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, ఈవీఎం లను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలను పరిశీలించేందుకు వీలుగా అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డితో కలిసి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆర్.కె కళాశాలను సందర్శించారు. రవాణ, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం అనువైన గదులను ప్రాథమికంగా పరిశీలించారు. తన వెంట ఉన్న అధికారులను, కళాశాల యాజమాన్యం ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో మరింత క్షుణ్ణంగా కళాశాల భవనాలను పరిశీలించి, సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్ తహసీల్దార్ గంగాధర్ తదితరులు ఉన్నారు.


కళాశాలను సందర్శించిన కలెక్టర్

18వేలు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో తండ్రిలేని కుటుంబానికి 18వేలు ఆర్థిక సహాయం అందజేసినట్టు పడకల్ గ్రామ రేషన్ డీలర్ రమేష్ తెలిపారు. పడకల్ గ్రామంలో 1998-99 బ్యాచ్ సుజాత, ఆమె భర్త మరణించడంతో అనాథలు అయిన ఇద్దరు కూతుళ్లకు బ్యాచ్ తరఫున 18వేల రూపాయలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో కె.రమేష్, జి.గంగాధర్, బి.సుమలత, టి.ప్రసాద్, పి.రమేష్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను మూసివేసి పర్మిట్ రూంలను తొలగించాలి

- బహుజన లెఫ్ట్ మహిళా సంఘం


మాట్లాడుతున్న మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తాగుబోతుల తెలంగాణగా మార్చివేసిందని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత విమర్శించారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వానికి బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కమిటి శుభాకాంక్షలు తెలియజేస్తుందని తెలిపారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు బెల్ట్ షాపుల రద్దు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైన్స్ షాప్‌ల పక్కనే వందలాది మంది మధ్యం సేవించే విధంగా పర్మిట్ రూంలను ఏర్పాటు చేసి, పేదలను తాగుడుకు బానిసలుగా మార్చారని ఆమె గత ప్రభుత్వ మధ్యం పాలసీపై ధ్వజమెత్తారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా ఉచిత బస్ ప్రయాణం, 500 వందలకే సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, నగర నాయకులు అశ్విని, చిన్నబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభ


మాట్లాడుతున్న సర్పంచ్ రూప

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కొనసముందర్ గ్రామంలో గురువారం సర్పంచ్ ఇంద్రాల రూప రాజేందర్ అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో ఉపాధి హామీ పథకంలో చేపట్టే సీసీటీలు, డబ్ల్యూఏటిలు, కుంటలు, పంట కాలువలు, ఇంకుడు గుంతలు, బీడు భూముల్లో భూమి చదును పనులు, చెక్ డ్యాములు, పండ్లతోటలు, ఎస్‌జిటీలు, రోడ్డుకు ఇరువైపులా ఫౌండేషన్, నర్సరీ మిగతా పనుల గురించి గ్రామసభలో చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రూప రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ బడ్జెట్‌కు అనుగుణంగా సంవత్సరానికి సరిపోయే పనులు గుర్తించా లన్నారు. హరితహారంలో భాగంగా ఒకరోజు తప్పి మరొక రోజు మొక్కలకు నీటిని అందించాలని సూచించారు. నూతన నర్సరీకి స్థలం చదును చేసి ప్రైమరీ బ్రెడ్స్ సిద్ధం చేయాలని గ్రామసభలో తెలిపారు. అదేవిధంగా గ్రామంలో నీటి సమస్యలు ఉన్న, మురికి కాల్వ సమస్యలున్న, వీధి దీపాల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ కోరారు. ఈ గ్రామ సభలో పంచాయితీ కార్యదర్శి నవీన్ గౌడ్, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ మంజూ రాణీ, ఫీల్డ్ అసిస్టెంట్ జంగిటి గోపాల్, కరోబార్ మోహన్, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ టెన్త్ క్లాస్ నిర్వహిస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఏఐపిఎస్‌యుజిల్లా కార్యదర్శి జ్వాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని శ్రీ చైతన్య పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యా సంవత్సరం పూర్తి కాక ముందే వారికి అడ్వాన్స్ పదవ తరగతి సిలబస్

బోధిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్‌యూ) నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి (డిఈఓ) కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి జ్వాల మాట్లాడుతూ.. శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థల్లో వారు పెట్టే ఒత్తిడిని భరించలేక చాలామంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డ విషయం అందరికి తెలిసిందేనని అన్నారు. ఇవన్నీ చాలవు అన్నట్టుగా నిజామాబాద్ జిల్లాలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలల్లో 9వ తరగతి పూర్తి కాని విద్యార్థులకు అడ్వాన్స్ టెన్త్ క్లాస్ సంబంధించిన తరగతులను బోధించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠాలు కాకుండా వారిని మరింత ఒత్తిడికి గురి చేసేలా పదవ తరగతి సిలబస్ బోధించడం అనేది వాళ్లను మానసికంగా ఒత్తిడికి గురి చేయడం లాంటిదని అన్నారు.

వచ్చే విద్యా సంవత్సరంలో జాయిన్ అయిన కొత్త విద్యార్థులకు మళ్లీ టెన్త్ క్లాస్ పాఠాలు ఎలాచెప్పడం జరుగుతుందని తెలిపారు. ఆ విద్యార్థులు గతంలో చదివిన విద్యార్థులకంటే వెనకంజలో ఉండడం జరుగుతుందని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలు కొత్త విద్యార్థుల పట్ల వివక్షను చూపుతున్నట్టే కదా.. ఇప్పటికైనా కొత్తగా శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో పదవ తరగతిలో జాయిన్ అయ్యే విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురిచేసే విద్యాసంస్థలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారులను డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.


డిఈఓకు వినతి పత్రం అందజేత

అసెంబ్లీ నూతన స్పీకర్‌కు అభినందనలు

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర 3వ శాసనసభాధిపతిగా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గురువారం మధ్యాహ్నం ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి మాట్లాడుతూ ఎంపీటీసీ స్థాయి నుంచి అసెంబ్లీ స్పీకర్ గా ఎదగడం హర్షించదగ్గ విషయమన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో పదవులకు ఆశించి ఉన్నతమైన స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. అభినందనలు తెలిపిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు పోల ప్రవీణ్, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, రాజ్ కుమార్, ఏలేటి విజయ్ రెడ్డి, సాజిత్, అబ్రార్, ముజ్జు, సందీప్, తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలి

- జీజీ కాలేజీలో పీజీ ఫ్యాకల్టీని వెంటనే నియమించాలి
- కలెక్టర్ కార్యాలయం ముందు పీడీఎస్‌యూ ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని పీజీ (గిరి రాజ్ ప్రభుత్వ) కళాశాలలో లెక్చరర్స్ నియమించాలని డిమాండ్ చేస్తూ, నిజామాబాద్ కలెక్టరేట్ ముందు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఏవో ప్రశాంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, నగర అధ్యక్షులు ఎస్కే అషూర్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా విస్మరించిందన్నారు. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ రాక ఉద్యోగాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైన, కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలలో సిలబస్ పేపర్స్ తగ్గట్టు ఫ్యాకల్టీలను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చివరి, మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు తక్షణమే ఫీజులు చెల్లించాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఒకవేళ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి చెల్లించకుంటే విద్యార్థులను పరీక్ష హాల్ టికెట్లు ఇవ్వబోమని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గిరిరాజ ప్రభుత్వ కళాశాలలో పీజీ విద్యార్థులకు 8 పేపర్లు సిలబస్‌కి ఇద్దరు మాత్రమే ఫ్యాకల్టీ బోధించడం బాధాకరమన్నారు. 8 మంది ఫ్యాకల్టీ చేయాల్సిన పనిని ఇద్దరితోనే బోధించడం ద్వారా పూర్తి నైపుణ్యాలను విద్యార్థులకు అందించడంలేదని తెలిపారు.

ప్రతి విద్యార్థి ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులను చేయాలి అంటే సిలబస్ కు తగ్గట్టు పేపర్లకు తగ్గట్టు వెంటనే నియమించాల్సిందిగా అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల సిలబస్ తగ్గట్టు లెక్చరర్స్ నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే విద్యార్థి ఉద్యమాలు ఉధృతం చేస్తామని అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నగర నాయకులు ఆముక్త, యశ్వంత్, అమర్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆటో, ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు గురువారం ఎల్లారెడ్డి తహసీల్దార్ సిబ్బందికి తమను ఆదుకోవాలని వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వటంతో తమకు ఆటో నడపలేని స్థితిలో ఉన్నామని, తమ సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్రైవర్లు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మాచారెడ్డి

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి ఉపాధ్యక్షులు జీడిపల్లి నర్సింహారెడ్డితో సహా 8మంది ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, 15మంది సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరై సభను ప్రారంభించారు. మొదటగా వ్యవసాయ శాఖతో చర్చ ప్రారంభమై, ఐసిడిఎస్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, కేజీబీవీ, హార్టికల్చర్, విద్యాశాఖ, ఆర్అండ్‌బీ శాఖలపై చర్చించారు. చర్చలో భాగంగా వివిధ శాఖల అధికారులను వివిధ పనులపై సభ్యులు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు సభను విజయవంతంగా పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవు

- డిఆర్‌డిఏ పిడి చందర్ నాయక్

నవతెలంగాణ-రెంజల్

15వ విడత ప్రజావేదికలో పొరపాట్లు చేసిన క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవని, సాంకేతిక లోపాల వల్ల పొరపాట్లు జరిగాయని వచ్చే ఆడిట్ లోపు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని డిఆర్‌డిఏ పిడి చందర్ నాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం 15వ విడత ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సంవత్సర కాలంలో మండలానికి రూ.మూడుకోట్ల 20లక్షలపై ఆడిట్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ సమస్యలు, మస్టర్లలో దిద్దుబాట్లు, చనిపోయిన వారికి హాజరు వేయడం, పని ప్రదేశంలో సిగ్నల్స్ రాక ఇబ్బందులు, పనిచేసిన వారికి డబ్బులు రాకపోవడం లాంటి సమస్యలు ఎదురయ్యాయని ఆయన పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఎలాంటి పొరపాట్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. కొన్ని గ్రామాలలో మస్టర్లు పేర్లు లేకుండానే పేమెంట్ ఇచ్చారని, హరితహారంలో భాగంగా చనిపోయిన మొక్కలపై రికవరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జాబ్ కార్డులలో చనిపోయిన వారి పేర్లను తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలన్నారు. పొరపాట్లు చేసిన క్షేత్రసహాయకులకు 20 రోజుల్లో వాటిని గుర్తించి దుర్వినియోగం జరిగిన డబ్బులను రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిని కిషోర్, విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో శంకర్, ఎస్ఆర్పి అశోక్, ఎస్‌టిఎం అంజాగౌడ్, ఏపీవో రమణ, ఈసీ శరత్‌చంద్ర, సాంకేతిక సహాయకులు దేవిసింగ్, రాజేశ్వర్, గ్రామ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, డిఆర్పీలు, తనిఖీ బృందాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పిడి చందర్ నాయక్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-దోమకొండ

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బీబీపేట్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట్ మండల కేంద్రానికి చెందిన బ్యాగారి పరుశరామ్ (33) కూలీ పని చేసి జీవిస్తున్నాడు. తన సోదరి వివాహం గత కొన్ని నెలల క్రితం చేయగా.. అప్పులు తీరక పోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య ఇద్దరు కూతుళ్లున్నారు. భార్య బ్యాగారి పింకీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన పరుశరామ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భిక్కనూర్ పట్టణంలోని సిద్ధరామేశ్వర ఆలయ కమాన్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట్ పట్టణానికి చెందిన స్వామి (41) తన వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై బస్వాపూర్ గ్రామానికి వెళ్లి పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో సిద్ధరామేశ్వర ఆలయ కమాన్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో వాహనంపై ఉన్న స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించగా బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్‌రావ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన రాజారెడ్డి

నవతెలంగాణ-వర్ని

వర్ని మండలంలోని కూనిపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ పీసీసీ డెలిగేట్ రాజారెడ్డి గురువారం మంత్రి సీతక్కకు ఎలారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌తో పాటు రాజారెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులు పర్యావరణ పద్ధతులు పాటించాలి


కూరగాయల పంటలను పరిశీలిస్తున్న లయన్స్ ఫౌండేషన్ జిల్లా అధికారి రాజు

నవతెలంగాణ-పిట్లం

రైతులు పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలని రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా అధికారి రాజు అన్నారు. గురువారం మండలంలోని కంబాపూర్ గ్రామంలో కూరగాయల, యాజమాన్య, సాంకేతికత పద్ధతులపై శిక్షణ, క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయన పద్ధతులు తగ్గించి పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలని అన్నారు. జీవ సంబంధిత ఎరువులు, రైజోబియం వంటిని వాడడం వలన వాతావరణ కాలుష్యం జరగకుండా, పంట అభివృద్ధికి ఏ విధంగా దోహదపడతాయి అన్న అంశాలపై సమగ్రంగా వివరించారు. అనంతరం ఫౌండేషన్ జిల్లా అధికారిని శ్వేత మాట్లాడుతూ.. రైతులు వివిధ రకాల జీవనోపాధిని ఏర్పరచుకునేందుకు గొర్రెల, నాటుకోళ్ల పెంపకం, కూరగాయల సాగులాంటి ఉపాధి కల్పించే వ్యాపారాలు నిర్వహించేలా రిలయన్స్ ఫౌండేషన్ సహకరిస్తుందని పేర్కొన్నారు. భూసార పరీక్షల ద్వారా అందించిన ఫలితాల ప్రకారం ఎరువులను వేసుకోవాలని సూచించారు. అధికంగా ఎరువులు ఉపయోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, రైతు సేంద్రియ ఎరువులను ఉపయోగించి భూసారాన్ని కాపాడుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత పాటిల్, ఉపసర్పంచ్ సాయిగొండ, పంచాయతీ సెక్రెటరీ తుకారం, అడ్లూరు ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ సదాశివ, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సాయికుమార్, జైలొసింగ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బోరు మోటార్ దొంగ దొరికేనా..?


గ్రామపంచాయతీ కార్యాలయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలోని తాళం వేసిన స్టోర్ రూమ్‌లో నుంచి సుమారు 70 వేల విలువగల 7.5 హెచ్.పి మోటర్ దొంగతనం, తీర్మానం లేకుండా బిల్లుల జారీ గురించి వార్డు సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాళం వేసిన గదిలో నుంచి బోరు మోటర్ ఏ విధంగా పోయింద ని, తెలిసినవారు మాత్రమే దొంగలించి ఉంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నా రు. పంచాయతీ అధికారులు స్పందించి దొంగలించిన వారి నుంచి బోరు మోటర్ స్వాధీనం చేసుకొని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలిపారు.

ఆరు రకాల కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు

- సంస్థ కోఆర్డినేటర్ సయ్యద్ మొయిజ్

నవతెలంగాణ-కామారెడ్డి

సెట్విన్ సంస్థ (యువజన సర్వీసుల శాఖ) ఆధ్వర్యంలో మూడు నెలల కాలపరిమితి గల ఆరు రకాల కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని ఆ సంస్థ కోఆర్డినేటర్ సయ్యద్ మొయిజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, అకౌంట్స్ ప్యాకేజీ, టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్, మెహందీ కోర్సులలో ఈ నెల 15 నుంచి శిక్షణ ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. కోర్సు కాలంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించనున్నామని, కాగా కోర్సు ఫీజులో 50 రాయితీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన పిదప సెట్విన్ సంస్థ ద్వారా నిర్వహించే పరీక్షలో ఉతీర్ణులైన వారికీ ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఆ ధ్రువపత్రం ద్వారా స్వయం ఉపాధి పథకాలు చేపట్టవచ్చని ఆయన సూచించారు. ఈ కోర్సులో ప్రవేశానికి 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయి నా వారు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సులలో ప్రవేశం పొందగోరే జిల్లాకు చెందిన అభ్యర్థులు వెంటనే 7386180456 లేదా 7989159121 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

పోచారం ప్రధాన కాలువలో పంపు సెట్లు పెట్టొద్దు

- బీ జోన్ చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తాం
- ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పోచారం ప్రధాన కాలువలో పంపు సెట్లు పెట్టొద్దని ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. బీ జోన్ చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని వివరించారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండల రైతులతో, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం ప్రాజెక్టు నుంచి యాసంగి 2023-2024 పంటలకు నీటి విడుదలకై ప్రాజెక్ట్ లెవల్ 1461.12 అడుగులు కెపాసిటీ 1.368 టిఎంసి గల నీటిని (బి)జోన్‌కు విడుదలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పోచారం ప్రధాన కాలువలో ఎవరు కూడా పంపు సెట్లు వాడకూడదని రైతులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆడివిలింగాల తరువాత బోర్, చెరువు సౌకర్యం లేని వాళ్ళ ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించా రు. (బి)జోన్ పరిధిలోని గ్రామాలకు 4 తడులకు నీరు అందేలా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసీ ఉషగౌడ్, ఎంపీపీ మాధవి ఆయా గ్రామాల సర్పంచ్‌లు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-బోధన్

తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా తపాల ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె గురువారం నాలుగో రోజు కొనసాగింది. ఈ సమ్మెలో ఉద్యోగులు ప్రసన్నలక్ష్మి, యాదగిరి, పాష, ఇక్రం అలీ, సయ్యద్ మోసిన్, వాజిద్, సునీల్, గంగశేఖర్, వందన, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి: గ్రామీణ తపాల ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలంటూ గ్రామీణ తపాల ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. సబ్ డివిజన్ పోస్టాఫీస్ వద్ద సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల చేత వెట్టిచాకిరి చేయించుకుంటుందని, గత ఎనిమిది సంవత్సరాల క్రితం గ్రామీణ తపాల శాఖ ఉద్యోగుల కొరకు ఏర్పాటు చేసిన కమలేష్ చంద్ర కమిటీ అందించిన సానుకూల సిఫారసులు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కాలానికి అనుగుణంగా పోస్టల్ శాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విధులు నిర్వహిస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులకు పనికి తగిన వేతనం అందించకుండా పర్మినెంట్ చేయకుండా ఇబ్బందులను గురిచేస్తున్నారన్నారు. ఎనిమిది గంటల పనిని కల్పిస్తూ అన్ని సౌకర్యాలు కల్పించాలని, గ్రాటివిటీ రూ.5లక్షలకు పెంచి హెల్త్ సౌకర్యం కల్పించాలని జిడిఎస్‌లకు 12, 24, 36, ఇంక్రిమెంట్లను వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు లింగం, కార్యదర్శి నయీం, సహాయ కార్యదర్శి రుషి, తపాల శాఖ సుమారు 300 మంది సిబ్బంది పాల్గొన్నారు.


సమ్మె నిర్వహిస్తున్న తపాల ఉద్యోగులు

మూడవ రోజుకు తపాలా శాఖ ఉద్యోగుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-ఆర్మూర్

సబ్ డివిజన్ తపాల శాఖ ఏఐజీడీఎస్ యూ ఆధ్వర్యంలో హెడ్ పోస్టాఫీస్ ముందు 18 సబ్ పోస్టాఫీసుల పరిధిలో పని చేస్తున్న బీపీఎంలు, ఏబీపీఎంల నిరవధిక సమ్మె గురువారంతో 3 వ రోజు కు చేరుకుంది. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులు లింబాగౌడ్ మాట్లాడుతూ... గ్రామీణ తపాల ఉద్యోగులు చాలీచాలని జీతంతో అనేక సంవత్సరాల నుండి సేవలందిస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో నూతన అకౌంట్లు ఓపెన్ చేస్తూ ప్రమాద బీమాలాంటి కొత్త స్కీములను ప్రచారంచేస్తూ ప్రతీ నెల గ్రామీణ ప్రాంతాల్లో పెన్షన్లు పంపిణీ చేస్తూ ఇచ్చిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ విధి నిర్వహణ సమయం 8 గంటలకు పెంచి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నూతన పీఆర్సీలో రెగ్యులర్ స్కేల్ వర్తింపజేస్తూ రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ పెన్షన్, గ్రాట్యువిటీ, కమిటేషన్ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఇవ్వాలని, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని అన్నారు. జీడీఎస్‌లు మొబైల్ ఫోన్లతో విధులు నిర్వహిస్తూ టార్గెట్లు పూర్తి చేస్తున్నామని, భవిష్యత్తులో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా స్లాట్ పాయింట్లను అనుసరింప జేయాలని తెలిపారు. తపాల సేవలను మరింత విస్తృతం చేయడానికి ఆర్ఐ సిటి డివైజ్‌లను ఉపసంహరించి లాప్‌ట్యాప్‌లు, ప్రింటర్స్ బ్రాడ్‌బ్యాండ్ నెట్వర్క్ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లకు ఇవ్వాలన్నారు. పెయిడ్ లీవులు 180 వరకు జమ చేసుకొని నగదు పొందే సౌకర్యం ఏర్పాటు చేయాలని, డిమాండ్లు సాధించే వరకు ఈ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని రాష్ట్ర నాయకులు మంథని బీపీఎం లింబాగౌడ్, సబ్ డివిజన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలి

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నిజామాబాద్ జిల్లా సమావేశం గురువారం నిజామాబాద్ నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా ఈనెల 15 నుండి జనవరి 15 వరకు జిల్లాలో అన్ని మండల కమిటీలు వెయ్యాలని సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. పూర్తి స్థాయి జిల్లా కమిటీని కూడా వేసుకొని జిల్లాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని తీర్మానం చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఎమ్మెస్పి జాతీయ నాయకులు మనికొల్ల గంగాధర్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు యమున, సత్తెమ్మ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రోడ్డ ప్రవీణ్, జిల్లా సంయుక్త కార్యదర్శి సుమన్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు భుమన్న, శ్యామ్, ఎమ్మెస్ పి టౌన్ నాయకులు శ్రీనివాస్, శ్రీ రాములు, ఎంఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు సుధ, ఎమ్మార్పీఎస్ టౌన్ కన్వీనర్ మహేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోమటిపల్లిలో పశువైద్య శిబిరం


పశువులకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కోమటిపల్లి గ్రామంలో గురువారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, రిలయన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించినట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.రవి కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కృత్రిమ గర్భధారణ నిర్వహించినట్టు వివరించారు. పశువులకు చికిత్సలు చేయించుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఈ శిబిరంలో పలు పశువులకు కృత్రిమ గర్భాధారణ చికిత్సలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. 8 పశువులకు చూడి పరీక్షలు చేసి నట్టల నివారణ మందులు పంపిణీ చేశామని వివరించారు. పాడి పశువులకు గడ్డి విత్తనాలు, మినరల్ మిక్సర్ పశువైద్యాధికారి చేతుల మీదుగా రైతులకు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎదురుగట్ల సుగుణ రమేష్, ఎంపీటీసీ కళ్యాణి దత్తు, రిలయన్స్ ఫౌండేషన్ ఆర్ఎఫ్‌పిఎఫ్ రాజు, సూపర్‌వైజర్ కృష్ణ, గోపాలమిత్రులు రమేష్, ఎజాజ్, మల్లేష్, శివలాల్ వెంకట్, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

- వేధింపులు, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఐయస్ ఆర్‌డి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అమృత రాజేందర్ తెలిపారు. ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ, సాధన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు, మాదక ద్రవ్యాల గురించి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమృత రాజేందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోందని, సామాజిక మాధ్యమాల ద్వారా బాల, బాలికలు అప్రమత్తంగా లేకపోతే సైబర్ క్రైమ్ నేరాలు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో సందేశాలు, వీడియోకాల్‌లు చేయకూడదని తెలిపారు. ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపితే తెలియని వ్యక్తులను ఆమోదించకూడదని వివరించారు. వ్యామోహం ఆకర్షణల ఫలితంగా తెలిసీ తెలియని వయస్సులో బాల, బాలికలు సమస్యల్లో చిక్కుకుంటున్నారని, మానవ అక్రమ రవాణ దేశంలో పెద్ద మొత్తంలో జరుగుతుందన్నారు. మనమందరం కలిసికట్టుగా ఉండి అక్రమ రవాణకు గురికాకుండా ఉండాలని తెలిపారు. అనంతరం సాధన ఆర్గనైజేషన్ కౌన్సిలర్ రవళి మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై, బాలికలకు జరుగుతున్న హింసలపై, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం నేరం, బాల్యవివాహాలు చేసినా చట్ట రీత్యా నేరమని తెలిపారు. బాల కార్మికులు, బడిబయట పిల్లలు కనిపించినా, చూసినా, బాల్య వివాహాలు చేసినా 1800102722 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సాందీపని విద్యాసంస్థల డైరెక్టర్ బాలాజీ రావు, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుకు అవగాహన కల్పిస్తున్న అమృత రాజేందర్

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రేంజర్ల నర్సారెడ్డి

నవతెలంగాణ-కమర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన రేంజర్ల నర్సారెడ్డి ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయంగా రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం విరాళం మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయనకు అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, బద్దం రాకేష్, సురంగి చంద్రశేఖర్, రాజారామ్, అయ్యప్ప మాలధారణ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-సిరికొండ

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ.. ఓటర్ నమోదుకు సంబంధించిన బీఎల్ఓలు, పంచాయతీ సెక్రటరీలకు ఎంపీడీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నిజామాబాద్ ఈఆర్ఓ, ఆర్‌డీవో ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా 01-01-2024 నాటికి కటాఫ్ డేట్‌గా కొత్త ఓటర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎలాంటి ఓటర్ ఐడిలో తప్పులు ఉన్నా కూడా సరిదిద్దుకోవడానికి దీనిని ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు, కారోబార్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణ కేంద్రంలోని నందిగలికి చెందిన వడ్ల గంగకు జిఎస్ ఫోర్‌ఎస్ సొసైటీ అధ్యక్షుడు పిల్లోల్ల గంగస్వామి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. గంగ అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. డబ్బులు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధితురాలి బాధను తెలుసుకొని జిఎస్ ఫోర్‌ఎస్ సొసైటీ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. బాధితురాలికి ఇంకా మెరుగైన వైద్యం అందించేందుకు సొసైటీ తరపున కావలసిన సహాయ సహకారాలు అందజేస్తామని గంగ స్వామి తెలిపారు. ఈయన వెంట చారి కొడిగెల శీను తదితరులు ఉన్నారు



ఆర్థికసాయం అందిస్తున్న సొసైటీసభ్యులు

రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఎల్లారెడ్డిపల్లి విద్యార్థులు ఎంపిక



హాకీకి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 8న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్ జిఎఫ్) అండర్-14 సంవత్సరాల బాల బాలికల ఉమ్మడి నిజామాబాద్ జిల్లా హాకీ ఎంపికలు కామారెడ్డి లో నిర్వహించామని,అని పోటీలలో లావుడియా రాకేష్,లావుడియా గుర్నాథ్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారా చంద్రశేఖర్ గురువారం తెలిపారు.ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 ,17, 18 తేదీలలో కామారెడ్డి లో జరగబోయే రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఈనెల 13న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్ జిఎఫ్) అండర్-17 సంవత్సరాల బాల బాలికల ఉమ్మడి నిజామాబాద్ జిల్లా హాకీ ఎంపికలు ఆర్మూర్ జావిద్ భాయ్ మినీ స్టేడియంలో నిర్వహించారని ఇందులో లావుడియా అరవింద్, బోధన్ మల్లికార్జున్, లావుడియా జీవన్ ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారా చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ గుర్రపు నరేష్, ఎంపీటీసీ తలారి బాబురావు, ఉప సర్పంచ్ గొల్ల శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు అభినందించారు.

ఇంధన వనరుల పొదుపుపై దృష్టి సారించాలి



ఇంధన పొదుపు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

సహజ, శక్తి వనరులను పరిమితంగా వాడుకోవాలని, పునరుత్పాదక శక్తివనరులు, ఇంధన వనరుల పొదుపుపై నవతరం దృష్టి సారించాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య తెలిపారు. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ పాఠశాల నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. జీవవైవిధ్యాన్ని జీవి పరిణామాన్ని సమతుల్యతలో ఉంచే శక్తి వనరులను ప్రోత్సహించాలని, పర్యావరణాన్ని కాపాడి, భూతాపం పెరగకుండా సమస్త జీవ కోటి మనుగడకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలన్నారు. ఇంధన వనరులను, శక్తి వనరులను పొదుపుగా వాడడం, వృధాను నివారించి ప్రత్యామ్నాయ అవకాశాలు ఆలోచిస్తే కుటుంబ ప్రయోజనాలు తద్వారా జాతీయభివృద్ధికి దోహదమవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది కలిసి ఇంధన పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు ఈ అంశంపై చిత్ర లేఖనం, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు డైరీల పంపిణీ



న్యాయవాదులకు డైరీలు అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు 2024 ఉచిత డైరీలు సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు చిన్నా రెడ్డి,కార్యదర్శి అశోక్,సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి, రయ్యాడి రాజేశ్వర్, తాజుద్దీన్, జగన్, జక్కుల శ్రీధర్, గటడి ఆనంద్, విజయలక్ష్మి, రాజేందర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పిఆర్టియు మండల అధ్యక్షునిగా అంకం నరేష్



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

పిఆర్‌టియు మండల అధ్యక్షులుగా అంకం నరేష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దేవానందం నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పిఆర్టియు నాయకులు పెంట జలంధర్ తుమ్మల లక్ష్మణ్ రచ్చ మురళి,ఇట్టం గోపాల్, ప్రవీణ్ రెడ్డి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో ఘనంగా సపోస్ క్రిస్మస్ వేడుకలు

- క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబరాలు
- యేసుక్రీస్తు జనన నాటక ప్రదర్శన
- క్రిస్మస్ క్యారల్స్ ఆలపించిన సిఎస్ఐ కోయర్ బృందం



పాల్గొన్న ప్రొఫెసర్లు, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కరుణామయుడు ఏసు క్రీస్తు జన్మదిన ముందస్తు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాలులో ఈ వేడుకలను నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే క్రిస్మస్ సీజన్‌ను పురస్కరించుకొని ఈ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ఒక సాధారణ పశువుల పాకలో జన్మించినా తన వ్యక్తిత్వంతో లోకానికి రారాజు అయ్యారని, యేసుక్రీస్తు మరణ సమయంలోనూ కరుణ చూపించారని.. అందుకే ఆయన లోకానికి ప్రభువు అయ్యారని తెలిపారు. ఈ ఆసుపత్రిలో జనవరి 1న నూతన సంవత్సర వేడుకల మొదలు కొని అన్ని వర్గాల పండుగలను జరుపుకుంటూ చివరి నెల డిసెంబర్‌లో క్రిస్మస్ వేడుకలతో సంవత్సరం ముగుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సిబ్బంది. నర్సింగ్ విద్యార్థులు ఏసు క్రీస్తు జన్మ వృత్తాంతానికి సంబంధించిన రూపకాన్ని ప్రదర్శించి విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అదేవిధంగా సిఎస్ఐ చర్చ్ బృందం ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందితో కలిసి సంగీత వాయిద్యాలతో క్రిస్మస్ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ప్రతిమ రాజ్, జాన్, సుకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ ఇంగ్లీష్, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్స్, నర్సింగ్ ఆఫీసర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం





ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... గెలిపించిన ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఇచ్చిన హామీలను ప్రతి ఒకటి నెరవేరుస్తానని తెలిపారు. నగర ప్రజల కు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యలు తీరుస్తానని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకొస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన ఆరుగ్యారెంటీ పథకాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం బలహీన వర్గాల అభ్యునతి కోసం పని చేయాలనీ అన్నారు. అర్బన్ ప్రజల గళం అసంబ్లీ లో వినిపించి వారి సమస్యలు తీర్చి వారికి సేవకుడిగా ఉంటాను అని హామీ ఇచ్చారు.

ఆర్మూర్ :నియోజకవర్గ శాసన సభ్యునిగా ఎన్నికైన పైడి రాకేష్ రెడ్డి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం చూపుతానని ప్రమాణం చేశారు. వీరితో పాటు కామారెడ్డి ఎమ్మెల్యేగా కాటిపల్లి వెంకట్ రమణ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు లత రాజు , ధ్యాగ ఉదయ్ ,యామాద్రి భాస్కర్ పటేల్, సంతోష్ రెడ్డి, జాగీర్దార్ శ్రీనివాస్, దుగ్గి విజయ్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నానో యూరియాతో అద్భుత ఫలితాలు

ఇఫ్కో కంపెనీ ఎఫ్ఓ శివరామకృష్ణ



అవగాహన కల్పిస్తున్న ఇఫ్కో కంపెనీ ఎఫ్ఓ శివరామకృష్ణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నానో యూరియాతో రైతులు అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఇఫ్కో కంపెనీ ఎఫ్ఓ శివరామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని నాగపూర్ గ్రామంలో ఇఫ్కో క్షేత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో 20 రోజుల క్రితం ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో డేమో రూపంలో నానో యూరియా, నానో డిఏపిని పలువురు రైతులకు అందించారు. 20 రోజుల క్రితం అందించిన నానో యూరియా, నానో డిఏపి వల్ల పంటలకు కలిగే మేలును, వాటి పనితనాన్ని కంపెనీ ప్రతినిధులు గురువారం రైతులకి క్షేత్రస్థాయిలో వివరించారు. నానో యూరియా, డిఏపి పనితీరును, వాడుకొనే విధానాన్ని, దాని వల్ల రైతులకి జరిగే మేలును కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, బిఆర్ఎస్ నాయకులు రవికిరణ్, ఇఫ్కో ప్రతినిధిలు ఎఫ్‌డిఎస్ ఐ.అరుణ్, ఎఫ్‌డి శశిధర్, నాగపూర్ రైతులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి



అడ్మిన్ బిల్డింగ్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పరిక్షలపై మానసిక ఒత్తిడిని అధిగమించాలని ఎండి సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ ఎండమూరి అన్నారు. గురువారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని ఘన్పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రవితేజ ఎండమూరి మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో ఒత్తిడిని, పరీక్షల సందర్భంగా ఒత్తిడిని అదిగమించుకుని ముందుకు సాగాలని సూచించారు. కొన్ని మెలుకువలను నేర్పించారు. ఎవరికైన మానసిక ఒత్తిడిని నివారించడానికి టోల్ ఫ్రీ నెం. 14416ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్. చంద్ర విఠల్, కళాశాల సిబ్బంది, సూర్య ఆరోగ్య సంస్థ చీఫ్ ఆపరేషన్, ఆఫిసర్ కె. రాజేంద్ర కుకూర్, పాల్గొన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని గాంధీనగర్‌కు చెందిన వివాహిత ఆల్లెపు లక్ష్మి (28) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ వివరాల ప్రకారం.. అల్లెపు ప్రసాద్, లక్ష్మి దంపతులు గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. బతుకుదెరువు కోసం ప్రసాద్ గల్ఫ్ దేశానికి వెళ్ళాడు. భార్యాభర్తల మధ్య తరచూ ఫోన్లోనే గొడవలు జరుగుతుంటాయి. తన భర్తతో జరుగుతున్న గొడవలకు మనస్థాపం చెంది గురువారం ఉదయం 10 గంటల సమయంలో తన ఇంట్లోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి జాట్ పాట్ హన్నవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పంచనామ నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

వికలాంగులకు ఆటల పోటీలు



రన్నింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు



క్యారం ఆడుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో గల అన్ని రకాల వికలాంగ విద్యార్థినీ విద్యార్థులకు గురువారం పాత కలెక్టర్ మైదానంలో ఆటల పోటీలను నిర్వహించారు. ఈపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 19 న జరగబోయే ప్రపంచ వికలాంగుల దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం చేస్తారని జిల్లా సంక్షేమ అధికారిణి ఎస్.కె. రసూల్‌బీ అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి. రాజన్న, శ్రీ సాయిలు, డి.పి.యం, స్నేహ సొసైటీ సెక్రెటరీ ఎస్. సిద్దయ్య, గ్రేసీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ శోభారాణి, ఏ.పి.ఫోరమ్ ప్రెసిడెంట్ స్వరూప, డి.ఇ. ఓ. కార్యాలయం నుండి పిఈటీలు, కార్యాలయ సిబ్బంది, దాదాపు (350) మంది పలు రకాల వికలాంగులు పాల్గొన్నారు.

నేడు గౌతమి హాస్పిటల్‌కు ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణులు రాక

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ రోడ్డు బజాజ్ ఎలక్ట్రానిక్స్ పక్కన కల గౌతమి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు కిమ్స్, సన్ షైన్ హాస్పిటల్స్, ప్యారడైజ్ సర్కిల్ కు చెందిన ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రణయ్ గోరే వస్తున్నట్లు వైద్యులు రమేష్ రెడ్డి గురువారం తెలిపారు. ప్రతి నెల ప్రతి శుక్రవారం వైద్యులు కన్సలేషన్ కొరకు అందుబాటులో ఉంటారని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంటారని పేర్కొన్నారు. అపాయింట్మెంట్ కొరకు 9010733933, 7702747394 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

18న వే సెక్టమీ శిబిరం

జిల్లా వైద్యాధికారి సుదర్శనం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఏరియా ఆసుపత్రిలో వే సెప్టమి (కుటుంబ నియంత్రణ ఆపరేషన్) క్యాంపు ఈనెల 18న ఏరియా హాస్పిటల్‌లో 21వ తేదీ మోర్తాడ్ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సుదర్శనం తెలిపారు. పట్టణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ... మగవారికి నిర్వహించే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ పద్ధతిలో మగవారి కొరకు నిర్వహించే వాసెప్టమి ఆపరేషన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని ఈ ఆపరేషన్ కుట్టు కోత లేకుండా చాలా సులభంగా నిర్వహించే ఆపరేషన్ దీనికి ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు కాబట్టి ఈ ఆపరేషన్లు ఉచితంగా చేయడం జరుగుతుంది అని అన్నారు.. ఆపరేషన్ కొరకు వచ్చేవారు ఆధార్ కార్డు ,,బ్యాంక్ అకౌంట్ జిరాక్సు తీసుకొని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రమేష్, ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గిరిరాజ్ కాలేజ్‌లో పీజీ విద్యార్థుల నుంచి

డబ్బులు వసూలు చేయడం దారుణం

- సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి
- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గిరిరాజ్ కాలేజ్‌లో పీజీ సెల్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేసి 36వేల ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం పీజీ చదువుతున్న విద్యార్థులకు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ అడ్మిన్ బిల్డింగ్ ముందు పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీజీ కాలేజీలో దాదాపు 90శాతం మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, ప్రభుత్వ కాలేజీలో రీయింబర్స్‌మెంట్ డబ్బులు వసూలు చేయడం ఏంటని, పీజీ విద్యార్థులకు కోర్స్ ఫీజు సంవత్సరానికి 36వేలు ఉంటే ప్రభుత్వం కేవలం 20వేలు మాత్రమే ఇస్తుందని, మిగతా 16వేలు సంవత్సరానికి విద్యార్థులే కట్టాలని ప్రిన్సిపాల్ హుకుం జారీ చేశారని అన్నారు. ట్యూషన్ ఫీజు కట్టకపోతే పరీక్షల ఫీజులు కట్టించుకోవడంలేదని, విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీ చేస్తూ ఒక్క డిపార్ట్మెంట్ మెంట్‌కి ఇద్దరే లెక్చరర్లు పాఠాలు చెబుతున్నారని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు పెట్టి సరిపడా లెక్చరర్స్, ల్యాబ్ సౌకర్యాలు లేకుండా విద్యార్థుల నుండి కట్టిన ఫీజులు ఎటుపోతున్నాయని ప్రశ్నించారు, వెంటనే సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా కోశాధికారి దేవిక, యూనివర్సిటీ నాయకులు శివసాయి, రవీందర్, రామకృష్ణ, అక్షయ్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.



అడ్మిన్ బిల్డింగ్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మానవ సేవయే మాధవ సేవ

నవతెలంగాణ-మెండోర

బాల్కొండ మండలంలోని జలాల్ పూర్‌లో కరుణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటుక బట్టీల వద్ద కార్మికులకు దుస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరుణ ట్రస్ట్ చైర్మన్ మహేష్ కుమార్ కార్మికులకు దుస్తువులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు, అనాథలకు మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వినీల్, బాలాజీ, రాజ్ కుమార్, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని వడ్డెర కాలనీలో బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించినట్టు బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య గురువారం తెలిపారు. 10 మంది విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి ఇక నుండి ప్రతి రోజు బడికి రావాలని సూచించారు. కార్యక్రమంలో సిఆర్ పి లత, కాలనీ యూత్ సభ్యులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరులకు పదవి గండం

- ఎంపీపీపై అసమ్మతి
- మెజారిటీ సభ్యుల మద్దతుకోసం శిబిరానికి తరలింపు

నవతెలంగాణ-మాక్లూర్



తొమ్మిది సంవత్సరాలుగా ఎమ్మెల్యే పదవిలో ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆయన అనుచరులకు సైతం పదవి గండం తప్పడంలేదు. ఆర్మూర్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో ఆయన సన్నిహితులకు కూడా పదవి పోయేలా కనిపిస్తోంది. మాక్లూర్ మండల ఎంపిపి మస్త ప్రభాకర్‌కు అసమ్మతి పోటెత్తింది. ఆయనతో పాటు మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ గోపు లక్ష్మి పదవి నుంచి తప్పుకొనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఎంపిపి మస్త ప్రభాకర్, సింగిల్ విండో చైర్‌పర్సన్ తనయుడు గోపి రంజిత్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ప్రధాన అనుచరులుగా ఉన్నారు. వీరిలో ఎంపీపీ మస్త ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపె ట్టేందుకు ప్రత్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. మెజారిటీ సభ్యుల మద్దతు పొందేలా ఇప్పటికే కొందరిని తమ శిబిరానికి తరలించారు. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందిన వారు పది మంది ఎంపీటీసీ సభ్యులుగా గెలుపొందారు. ముగ్గురు కాంగ్రెస్, మరొకరు బీజేపీ తరపున విజయం సాధించారు. మొదట్లో ప్రభాకర్, గోవురీ ఒడ్డెన్న ఎంపీపీ పదవి కోసం పోటీపడ్డారు. ఈ క్రమంలో రెండున్నరేళ్ల చొప్పున అధికారంలో ఉండేలా వారి మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందుగా ప్రభాకర్‌ని అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం ఒడ్డెన్నకు నిరాశే ఎదురైంది. అయితే నెల క్రితం ఒడ్డెన్న బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అవిశ్వాస ప్రయత్నా లు ఊపందుకున్నాయి. మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఆరుగురు ఒడ్డెన్నకు అనుకూలంగా ఉండగా, నలుగురు ప్రభాకర్‌కు మద్దతిస్తున్నారు. మిగతా ఇద్దరు ఎటు తేల్చుకోలేక పోతున్నారు. ఇప్పుడు వారి మద్దతు కీలకంగా మారింది. తొమ్మిది మంది అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితేనే అధ్యక్ష పదవికి తిరిగి ఎన్నిక జరుగుతుంది. ప్రస్తుతం మాక్లూర్ 2వ ఎంపిటిసి మీరాబాయి కిడ్నాప్ అయినట్లు ఆమె భర్త నారాయణ పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు ఆమెను వెతుకుతునట్లు సమచారం. ఆమె వాట్సప్ వీడియో ద్వారా తాను తీర్థ యాత్రలకు వెళ్లానని, తనను ఎవ్వరూ కిడ్నాప్ చేయలేదంటు పోస్ట్ చేసింది. అలాగే మాజీ ఎమ్మెల్యే అనుచరుడు గోపు రంజిత్ తల్లి సింగిల్ విండో చైర్‌పర్సన్ గోపు లక్ష్మిపై బుర్రోల్ల అశోక్ సింగిల్ విండో చైర్మన్ కోసం పోటీ పడ్డారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో రెండున్నరేళ్ల చొప్పున అధికారంలో ఉండేలా వారి మధ్య ఒప్పందం కుదుర్చారు. మూడు సంవత్సరాలు అవుతున్నా, మాజీ ఎమ్మెల్యే చుట్టూ తిరిగిన బుర్రోల్ల అశోక్ కు చైర్మన్ పదవి ఇవ్వలేదు. ఇపుడు ఇస్తాం, అప్పుడు ఇస్తాం అంటూ కాలయాపన చేశారు. ప్రస్తుతం అశోక్ డైరెక్టర్ల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమచారం. మరి కొద్ది రోజుల్లో బుర్రోల్ల అశోక్ ను చైర్మన్ పదవి వరించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు చర్చించుకుంటున్నారు. ఈ విధంగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రధాన అనుచరులకు పదవి గండం ఉన్నట్లు స్థానికులు అనుకుంటూ చర్చించుకుంటున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరిత్యా నేరం

- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బి



సమావేశంలో మాట్లాడుతున్న శిశు సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బి

నవతెలంగాణ-ఆర్మూర్

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరిత్యా నేరమని, చేసే వారికే కాకుండా చేయించుకునే వారికి, అలా చేయించుకునేలా ప్రోద్బలం చేసిన కుటుంబ సభ్యులకు జైలు శిక్ష తప్పదని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రసూల్ బి అన్నారు. ఆలూరు మండలం లోని దేగాం గ్రామంలో గురువారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన అవగాహనలో మాట్లాడారు. ఆడ పిల్లల్ని బ్రతకనిద్దాం ..ఆడపిల్లలను చదవనిద్దామని, ఆడపిల్లల పుట్టనిద్దామని అన్నారు. లింగ వివక్షతతో గర్భస్రావానికి పాల్పడం స్త్రీల ఆరోగ్యంతో చెలగాటం ఆడడమేనని, అనాలోచితంగా జరిపే ఈ గర్భస్రావాలు తల్లి ప్రాణానికి ముప్పు తెస్తాయని అన్నారు. తల్లిదండ్రులు కానీ బంధువులు ఇతర వ్యక్తులు కానీ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు తెలిస్తే మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధించస్తారని తెలిపారు. ఆ తర్వాత ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా సైతం విధించబడతాయని అన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ భార్గవి, ఏసి డిపిఓ జ్యోతి, దేగాం మెడికల్ ఆఫీసర్ పూజ, పోషణ్ అభియాన్ రాంబాబు ,అంగన్ వాడి సూపర్వైజర్లు వెంకట రమణమ్మ, సమత, అంగన్వాడి టీచర్లు ఆశ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

అక్రమ మొరం తరలింపును అడ్డుకున్న తహసీల్దార్



అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్‌ను అడ్డుకున్న తహసీల్దార్

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని రాంపూర్ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా పక్క మండలానికి అక్రమంగా మొరం తరలిస్తున్న విషయాన్ని గ్రామస్తులు తెలుపగా తహసీల్దార్ ప్రభాకర్ గురువారం జెసిబి, మూడు ట్రాక్టర్లను పట్టు కొని సీజ్ చేశారు. అనుమతి లేకుండా మైనింగ్ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ సయ్యద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



నవతెలంగాణ-గాంధారి

ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. మండల కేంద్రానికి చెందిన గంగి అంజలి (16) సదాశివనగర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. 12.12.2023న కాలేజీకి బస్‌లో వెళ్ళింది. ఆ రోజు నుంచి ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి గంగి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రేమ్ దాస్ తెలిపారు.

కందకుర్తి గోదావరిలో గుర్తు తెలియని శవం లభ్యం

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని కందకుర్తి గోదావరిలో గుర్తు తెలియని శవం లభ్యమైందని ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. మృతుడికి 55 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, సంబంధీకులు 8712659874 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంబులెన్స్‌లో ప్రసవమైన గర్భిణీ



అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవమైంది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సోమర్యాఘడ్ తాండాకు చెందిన అజ్మీర్ శ్వేత (23) అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ఎంసిహెచ్ బాన్సువాడ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో వీర హనుమాన్ టెంపుల్ వద్ద పురిటి నొప్పులు అధికం కావడంతో 108 టెక్నీషియన్ సాధారణ డెలివరీ చేయగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది పైలెట్ సంగాగౌడ్, ఈఎంటి అరవింద్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుండి కార్మికులకు వేతనాలు రావడం లేదన్నారు. దీనితో కుటుంబ పోషణ భారంగా మారి రోడ్డు మీద పడే దుస్థితి నెలకొందన్నారు. కార్మికుల హక్కుల కోసం సమ్మె చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, కానీ జిల్లాలో నేటికీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అందించే సబ్బులు, నూనెలు, హ్యాండ్ గ్లౌజులు ఎప్పటికప్పుడు అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేదంటే మరోసారి ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మేజర్ పంచాయతీ అధ్యక్ష కార్యదర్శులు మాట్ల రాజు, సమ్మయ్య నాయకులు మోతిరామ్, వినోద్ పాల్గొన్నారు.

జన్మదినాన్ని పురస్కరించుకొని యోగ

నవతెలంగాణ-కామారెడ్డి



బికెఎస్ అయ్యంగారు 105 జన్మదినాన్ని పురస్కరించుకొని పతంజలి యోగ గురువు బండి రాములు 73 వ జన్మదినం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డిలో బండి రాములు యోగ నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా మహారాజు గుడిమెట్ మహదేవ్ స్వామీజీ, రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి అధ్యక్షులు పోలబోయిన సత్యం, కార్యదర్శి రాజ నరసింహారెడ్డి, కోశాధికారి సుధాకర్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు అంబీర్ మనోహర్ రావు, వార్డు కౌన్సిలర్ అవధూత నరేందర్, రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి సభ్యులు బండి రాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహదేవ్ స్వామీజీ, క్లబ్ అధ్యక్షులు సత్యం, అంబీర్ మనోహర్ రావు మాట్లాడుతూ.. తన గురువైన బికెఎస్ అయ్యంగార్ పుట్టినరోజు, ఆయన శిష్యుడు బండి రాములు పుట్టిన రోజులు ఒకేరోజు కలిసి రావడం చాలా గొప్ప విషయమని అన్నారు. బండి రాములు 73వ సంవత్సరంలో యువకుడిలాగా యోగ చేశాడని, అతనిని ఎంత పొగిడిన తక్కువేనన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఎత్తొండ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన మండవ ఆదినారాయణరావు వారి తల్లిదండ్రులు మండవ వరమ్మ, అంజయ్య భార్య రమాదేవి జ్ఞాపకార్థం 50 మంది పేదలకు దుస్తులను గురువారం పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు, పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. 90 సంవత్సరాల వయసులో కూడా సహాయ సహకారాలు చేయడం పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న మండవ ఆదినారాయణ రావును పలువు అభినందించారు. ప్రముఖ జర్నలిస్ట్ మండవ రమాదేవి, డాక్టర్ సుధాకర్, నిజామాబాద్ మండల విద్యాధికారి రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, కోటగిరి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉమానంద్, పిడి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఆదినారాయణరావు

ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఉపరితల గని అవసరాల కోసం విలువైన వ్యవసాయ భూములను దారాదత్తం చేసిన పరిసర గ్రామాల వారికి కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం అన్యాయమని బాధిత గ్రామాలు ఆరోపిస్తున్నారు. సింగరేణి ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తున్న పరిసర గ్రామావారు గురువారం ఇందారం ఓసీ వాహణాలను అడ్డుకున్నారు. స్థానికులకు అవకాశం కల్పించకుండా ఇతర ప్రాంతాల వారికి ఓసీ ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం పట్ల ఇందారం ఎంపీటీసీ అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక యువకులు ఓసీ వాహణాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇందారం ఓసీ కాంట్రాక్టు పొందిన వరాహా సంస్థ నియమించుకున్న స్థానికేతరులను తొలగించి వారి స్థానంలో స్థానికులైన నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ స్పందిస్తూ ఇందారం ఓసీ ఉద్యోగాల్లో కొనసాగుతున్న స్థానికేతరులను పక్కన పెట్టి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో యువకులు నిరసన విరమించుకున్నారు.

సాహిత్య కళా ఉత్సవాలకు అధ్యాపకుడికి ఆహ్వానం

నవతెలంగాణ-దహెగాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా తాడెపెల్లి గూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం అందినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నోముల చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16, 17వ తేదీల్లో తాడెపెల్లి గూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో 30 గంటల పాటు నిర్విరామంగా సాహిత్య కళా ఉత్సవాలు కొనసాగుతున్నాయని, దీనికోసం శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి నుండి ఆహ్వానం రావడం ఎంతో సంతోషకరమన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(ఎస్సీకేఎస్-సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో సంవత్సర కాలం నుండి వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్ వివరాలను ఇవ్వాలని ఆందోళనలు, పోరాటాల ఫలితంగా గత నెల గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కమిషనర్ అన్ని జీఎం కార్యాలయాలకు కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను పంపించారన్నారు. అన్ని ఏరియా లలో జీఎం ఆఫీసుల నుంచి ఇప్పటికే కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను ఇవ్వడం జరిగిందని, కానీ శ్రీరాంపూర్ ఏరియాలో మాత్రం నెల రోజులు గడుస్తున్న పాస్ పుస్తకాలను ఇవ్వడంలో నిర్లక్ష్యంగానే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అన్ని ఏరియాల్లో కార్మికులకు వచ్చిన శ్రీరాంపూర్‌లో మాత్రం ఇవ్వకపోవడంతో అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు అసహనానికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వచ్చిన సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను కార్మికులకు అందించాలని కోరారు.

సన్మానం కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న క్రిస్మస్ వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవ ప్రతిభ కనబరిచిన క్రైస్తవ సంస్థలను సన్మానించడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని, సన్మానం కోసం నామినేషన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఒక ప్రకటనలు పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గలవారు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఎంఎఫ్‌సీ.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా నేరుగా జిల్లా కార్యాలయంలో ఈనెల 16 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాల కోసం సెల్: 8500723745 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామ సమీపంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆదర్శ్ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో చర్మవ్యాధులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. భోజన సమయంలో చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని, పలు వైద్య సూచనలు, సలహాలు అందజేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ బసవయ్య, ఏఎన్ఎం యాదమ్మ, ఆశావర్కర్ నీలిమ, వైద్య సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అకౌంట్స్ ఆడిటింగ్



రికార్డులను పరిశీస్తున్న ఆడిటర్ విజయభాస్కర్

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో గురువారం జిల్లా ఆడిటర్ విజయభాస్కర్ ఆలయ రికార్డులను పరిశీలించి, ఆలయానికి వచ్చిన ఆదాయం వ్యయ ఖర్చులు ఆడిటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.